

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 14 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 15, డిసెంబర్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాజ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్





# రాజ్యాంగం రక్షణ పోరు రణరంగం !




రాజ్యాంగం "రక్షణ" పోరు" రణరంగం

రాజ్యాంగాన్ని మార్చాలను కోవడం రాక్షసత్వమే

అడ్డుదారిలో ప్రభుత్వ ఏర్పాటు చేసుకొని పాలిస్తున్నారు

బీహార్ ఎన్నికల్లో జాతీయ ఎలక్షన్ కమిషన్ గెలిచింది

ప్రజల ఓట్లతో పని లేకుండా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి

ఢిల్లీలో ఆర్ఎస్ఎస్ విలాసవంతమైన భవనానికి 200 కోట్లు ఎక్కడివి

భవనం చుట్టూ ఉన్న హిందూ మందిరాన్ని ఎందుకు కూల్చారు

ఆర్ఎస్ఎస్ దరిద్రపు ఆలోచనలను బిజెపి పాటిస్తుంది ?

రాజ్యాంగాన్ని తొలగిస్తే సుప్రీంకోర్టును తొలగించాల్సిందేనా !

రాజ్యాంగాన్ని మార్చాలనుకునే ముందు బిజెపి ప్రభుత్వాన్ని రద్దు పరచుకోండి

రాజ్యాంగాన్ని కాపాడుకొని తీరుతాం ఏఐసిసి నేత రాహుల్ గాంధీ

ప్రజల ఓపికను పరీక్షించడం బిజెపికి ఏమాత్రం మంచిది కాదు : డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

భారతదేశంలో ప్రజాస్వామ్యం ఒక క్రమ పద్ధతిలో విద్వాంసమైపోతుందని దాని అంతిమ మూలాలు మాత్రమే మిగిలిపోయాయని ప్రముఖ రచయిత్రి అరుంధతి పలికిన మాటలను భారతదేశ ప్రజలు జ్ఞాపకం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డాక్టర్ బరిగెల శివ అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలనుకునే తలంపు బిజెపి ప్రభుత్వానికి తగదన్నారు. ఒకవేళ రాజ్యాంగాన్ని మార్చాలనుకునే ప్రయత్నాలను తెరపైకి తీసుకు వస్తున్న కుట్ర దారులు భారత రాజ్యాంగానికి లోబడి 2023 జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో అడ్డుదారిలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న బిజెపి తక్షణం ప్రభుత్వాన్ని రద్దు పరచుకొని నిజాయితీని చాటుకోవాలన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలనుకోవడం అంటే ఒకరకంగా చెప్పాలంటే దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును మార్చాల్సిన అవసరం ఉంటుందన్న సంగతిని కేంద్ర ప్రభుత్వం ఎందుకు మరిచిపోతుందన్నారు. 2023 ఎన్నికలలో

- మిగతా 2లో..

# ఓట్ల దొంగ.. గద్దె దిగు...

ఢిల్లీలో భారీ ఎత్తున కాంగ్రెస్ ం 'ఓట్ చోరీ' నిరసన కార్యక్రమం

ఢిల్లీ రాంలీలా మైదానంలో కాంగ్రెస్ భారీ నిరసన సభ

ఎన్నికల సంఘం బీజేపీతో కుమ్మక్కైందని రాహుల్ ఆరోపణ

"ఓట్ల దొంగ.. గద్దె దిగు" నినాదంతో దద్దరిల్లిన సభా ప్రాంగణం

సత్యంతోనే మోదీ ప్రభుత్వాన్ని తొలగిస్తామన్న రాహుల్ గాంధీ

రాబోయే రాష్ట్రాల ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం

2



ఆస్ట్రేలియాలోని బాండీ బీచ్ లో కాల్పులు... 10 మంది మృతి 4

# హైదరాబాద్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్

భారీగా పట్టుబడ్డ మందుబాబులు!

హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్

వారాంతంలో పట్టుబడిన 850 మందికి పైగా వాహనదారులు

హైదరాబాద్‌లో 460, సైబరాబాద్‌లో 407 కేసులు నమోదు

తాగి ప్రమాదం చేస్తే 10 ఏళ్ల జైలు తప్పదని పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్, జై భీమ్ న్యూస్

హైదరాబాద్ నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వీకెండ్ లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 850 మందికి పైగా పట్టుబడినట్లు ఆదివారం పోలీసులు వెల్లడించారు. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ తనిఖీలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. డిసెంబర్ 12, 13 తేదీల్లో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 460 మందిని పట్టుకున్నారు. వీరిలో 350 మంది ద్విచక్ర వాహనదారులు, 25 మంది ఆటో డ్రైవర్లు, 85 మంది కార్ల డ్రైవర్లు ఉన్నారు. ఇక సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రైవ్‌లో 407 మంది పట్టుబడ్డారు. వీరిలో 290 మంది ద్విచక్ర వాహనదారులు, 90 మంది కార్ డ్రైవర్లు, 18 మంది ఆటో డ్రైవర్లు, 9 మంది భారీ వాహనాల డ్రైవర్లు ఉన్నారు. డ్రంక్ డ్రైవింగ్ విషయంలో ఏమాత్రం సహించేది లేదని, ఈ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. గత వారం (డిసెంబర్ 8-13) సైబరాబాద్ పరిధిలో 385 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు విచారించగా... 16 మందికి జైలు శిక్ష, జరిమానా విధించాయి. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు. ఈ సెక్షన్ కింద గరిష్ఠంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.





# తెలంగాణ రెండో విడత పంచాయతీ ఎన్నికలు

ఈసారి కూడా కాంగ్రెస్ దే జోరు

తెలంగాణలో రెండో విడత పంచాయతీ ఓట్ల లెక్కింపు

భారీ ఆధిక్యంలో కాంగ్రెస్ మద్దతుదారులు

సాయంత్రం 5 గంటల వరకు 600కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు

రెండో స్థానంలో కొనసాగుతున్న బీఆర్ఎస్

గ్రామీణ ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటున్న కాంగ్రెస్

2

## మడిపల్లి సర్పంచ్‌గా ఎన్నికైన బుర్ర రంజిత్ గౌడ్‌ను అభినందించిన బీఆర్ఎస్ మండల నాయకులు





**హన్మకొండ, 14 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి బుర్ర రంజిత్ గౌడ్ తన సమీప ప్రత్యర్థిపై 20 ఓట్ల స్వల్ప మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఒక బ్యాలెట్ ఓటుతో కలిపి మొత్తం 20 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఎన్నికల్లో మడిపల్లి గ్రామ ప్రజలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలిపినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. బుర్ర రంజిత్ గౌడ్ విజయం పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిందని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎన్నికల ఇంచార్జి అటికం రవీందర్ గౌడ్, సంగాల విక్టరీ బాబు నూతన సర్పంచ్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు చంద్రమోహన్, ఎర్రగట్టు గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ చింతల లక్ష్మణ్ యాదవ్, జయగిరి మాజీ సర్పంచ్ రాజు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు జన్ను కిషన్, మడిపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బుర్ర రాజు, గ్రామ యూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణ రెండో విడత పంచాయతీ ఎన్నికలు

**ఈసారి కూడా కాంగ్రెస్ దే జోరు**
**తెలంగాణలో రెండో విడత పంచాయతీ ఓట్ల లెక్కింపు**
**భారీ ఆధిక్యంలో కాంగ్రెస్ మద్దతుదారులు**
**సాయంత్రం 5 గంటల వరకు 600కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు**
**రెండో స్థానంలో కొనసాగుతున్న బీఆర్ఎస్**
**గ్రామీణ ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటున్న కాంగ్రెస్**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. తొలి విడతలో అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ, రెండో విడతలోనూ తన ఆధిపత్యాన్ని స్పష్టంగా ప్రదర్శిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ మద్దతు పొందిన అభ్యర్థులు భారీ ఆధిక్యంలో దూసుకెళ్తున్నారు. రాష్ట్రంలోని 193 మండలాల పరిధిలో 3,911 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు, 29,917 వార్డు సభ్యుల స్థానాలకు రెండో విడతలో ఎన్నికలు జరిగాయి. ఆదివారం మధ్యాహ్నం 1 గంటకు పోలింగ్ ముగిసిన వెంటనే లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. సాయంత్రం 8గంటల వరకు అందిన సమాచారం ప్రకారం, కాంగ్రెస్ మద్దతుదారులు 1,728 సర్పంచ్ స్థానాల్లో విజయం సాధించారు. బీఆర్ఎస్ మద్దతు పొందిన అభ్యర్థులు 912 స్థానాల్లో గెలుపొందారు. బీజేపీ బలపరిచిన అభ్యర్థులు సుమారు 201 స్థానాల్లో, ఇతరులు, స్వతంత్రులు 484 స్థానాల్లో గెలుపొందారు. ఈ ఫలితాల సరళిని బట్టి గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ తన పట్టును మరింత బలోపేతం చేసుకుంటోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతుండటంతో, తుది ఫలితాలు వెలువడటానికి మరికొంత సమయం పట్టనుంది. పూర్తి ఫలితాలపై రాత్రికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## ఓట్ల దొంగ.. గద్దె దిగు...

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

ఎన్నికల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో 'ఓట్ల దొంగ.. గద్దె దిగు' పేరిట భారీ నిరసన సభ నిర్వహించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సోనియా గాంధీ సహా పలువురు సీనియర్ నేతలు, వేలాది మంది కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ... కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) బీజేపీ ప్రభుత్వంతో కుమ్మక్కైందని తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. బీజేపీ కోసం పనిచేస్తున్నారని రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. "సత్యానికి, అసత్యానికి మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో ఎన్నికల సంఘం బీజేపీ వైపు నిలబడింది. బీజేపీ ఎన్నికల సమయంలో రూ.10,000 పంపిణీ చేసినా ఈసీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు" అని ఆయన విమర్శించారు. తాము సత్యం వైపు నిలబడి నరేంద్ర మోదీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ధీమా వ్యక్తం చేశారు. "అధికారం ఉన్నవారినే ప్రపంచం గౌరవిస్తుందని, సత్యానికి విలువ లేదని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ భావన. కానీ మా సిద్ధాంతం ప్రకారం సత్యమే అత్యంత ముఖ్యమైనది. ఆ సత్యంతోనే మేము మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని దేశం నుంచి తొలగిస్తాం" అని రాహుల్ ప్రతిజ్ఞ చేశారు. బీహార్‌లో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'తో ప్రారంభమైన 'ఓట్ల చోరీ' ప్రచారాన్ని దేశవ్యాప్తంగా ఉద్ధృతం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. గతంలో కర్ణాటక, మహారాష్ట్ర, హర్యానా రాష్ట్రాలలో ఓట్ల జాబితాలో అవకతవకలు జరిగాయని రాహుల్ ఆరోపించగా, ఈసీ వాటిని నిరాధారమైనవని కొట్టిపారేసింది. 2026లో అసోం, కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని, ఈ అంశాన్ని సజీవంగా ఉంచాలని కాంగ్రెస్ భావిస్తోంది.

# రాజ్యాంగం "రక్షణ" పోరు" రణరంగం

సుమారుగా ఐదు కోట్ల ఓట్లను దేశవ్యాప్తంగా 70 నియోజకవర్గాలకు పంచుకొని బిజెపి అధికారంలోనికి వచ్చినట్లుగా సాంకేతిక ఆధారాలు స్పష్టంగా, ప్రస్ఫుటంగా వెల్లడిస్తున్నాయన్నారు.2023 పార్లమెంటు ఎన్నికల్లో జరిగిన అవకతవకలను అటు పోట్లను దేశవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణులు క్షేత్రస్థాయిలో పరిశీలించాకే బీజేపీ పన్నిన కుట్రలను సోషల్ మీడియాలో ఆధారాలతో సహా బహిర్గతం చేశారన్నారని అన్నారు.దానిని మర్చిపోకముందే బిహారి ఎన్నికల్లో ప్రజాస్వామ్యానికి బదులు రాజ్యాంగ విలువలకు బదులు ప్రజల పరిరక్షణకు బదులుగా జాతీయ ఎన్నికల కమిషన్ అధికార బలం గెలిచిందని తీవ్రంగా దుయ్యబద్దారు.ఢిల్లీ ప్రధాన ప్రాంతంలో ఆర్ఎస్ఎస్ నూతన భవనానికి 200 కోట్ల రూపాయలు ఎక్కడి నుండి వచ్చాయని ప్రశ్నించారు.ఎలాంటి రిజిస్ట్రేషన్ లేని అనధికార హోదాలో కొనసాగుతున్న ఆర్ఎస్ఎస్ నూతన భవనం పక్కన ఉన్న ప్రతిష్టాత్మకమైన హిందూ దేవాలయాన్ని కూల్చివేసి ఆర్ఎస్ఎస్ భవనం నిర్మించుకోవడంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు ఎందుకు తీసుకోలేకపోతుందన్నారు. సుప్రీంకోర్టు సుమోటాగా స్వీకరించి కేసును ఎందుకు పరిగణలోనికి తీసుకోవడం లేదని కోరారు.ఇతర మతస్తులపై సునాయాసంగా దాడి చేసే వక్రబుద్ధి కలిగిన మేధావులకు సాక్షాత్తు ఢిల్లీ ప్రధాన గడ్డపై హిందూ దేవాలయాన్ని కూలిస్తే గమ్మున ఎందుకు ఉంటున్నారన్నారు.200 కోట్ల రూపాయలను పోగు చేసుకున్న ఆర్ఎస్ఎస్ పై ఈడి,ఐటీ దాడులు ఎందుకు నిర్వహించడం లేదని సూటిగా ప్రశ్నించారు.బిజెపి పాటిస్తున్న ఆచరణలన్నీ ఆర్ఎస్ఎస్ సూచిస్తున్నవేనని దానివల్ల దేశభద్రత దేశ సమగ్రత దేశ ప్రజాస్వామ్యం పూర్తిగా నాశనం అయిపోతుందని ఒక్కానించి చెప్పారు.మేధావులు కూడా ముదురుతనాన్ని ప్రదర్శిస్తూ దేశ సమగ్రతకు జరుగుతున్న వికృతమైన కుట్రలను ప్రోత్సహిస్తుండడం తీవ్రమైన నేరంగా భావించాల్సి ఉందన్నారు.ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో జరుగుతున్న మహా ధర్నాలో ప్రియాంక గాంధీ మాట్లాడిన మాటలను పూర్తిగా సమర్థిస్తూ కర్ణాటక మహారాష్ట్ర హర్యానా బీహార్లలో బిజెపి జాతీయ ఎన్నికల కమిషన్ అనే ఆయుధాన్ని ఉపయోగించుకొని గెలిచిందని తెలపడాన్ని సమర్థించారు.దేశ భద్రత కోసం దేశ రక్షణ కోసం రాహుల్ గాంధీ 8000 కిలోమీటర్లు యాత్ర చేశారని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించడం చూస్తుంటే దేశంలో జరుగుతున్న ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను రాహుల్ గాంధీ స్వయంగా పరిశీలించితెలుసుకోవడం కోసం యాత్ర చేసినట్లుగా ఉందన్నారు.రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను జ్ఞాపకం చేసుకుంటూ ప్రధానమంత్రి మోడీ కేంద్ర మంత్రి అమిత్ షాలు ఓటు చోరీకి పాల్పడుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించడాన్ని దేశ ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.దేశంలో సత్యానికి అసత్యానికి మధ్య పోరాటం జరుగుతుందని దానిలో భాగంగా బిజెపితో కలిసి జాతీయ ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని దేశంలో ఎక్కడ ఎన్నికలు జరుగుతున్న ఓటు చోరీ బహిరంగంగా ఆధారాలతో సహా జాతీయ ఎన్నికల కమిషనర్ విడుదల చేస్తుందని ఇంత దిగజారుడు తనంతో పాటు అప్రజాస్వామికమైన విలువలతో ఒకవైపు దేశాన్ని శాసిస్తూ మరోవైపు దేశ భద్రతకు దేశ రక్షణకు దేశ సమగ్రతకు రక్షణ కవచంలా నిలుస్తున్న భారత రాజ్యాంగాన్ని తొలగించాలని కుట్రలు పన్నుతుండడం బిజెపికి ఏమాత్రం తగదు అన్నారు.79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో భారత రాజ్యాంగాన్ని ఇంత హీనంగా అవమానపరచిన దాఖలాలు ఎప్పుడూ చూసెరుగమన్నారు.అదే మైదానంలో తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను జ్ఞాపకం చేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతున్న రాహుల్ గాంధీకి దేశంలోని ప్రతి ఒక్కరు మద్దతు తెలుపాలని పిలుపునివ్వడంతోపాటు ఓటు చోరీ సమస్య కాంగ్రెస్ పార్టీని మాత్రమే కాదని దేశంలోని ప్రతి ఒక్కరిని వాక్యానించడాన్ని పూర్తిగా సమర్థించాలన్నారు.దేశంలోని ఎన్నికల వ్యవస్థలను కలుషితం చేస్తూ పేదల ఓటు హక్కు లేకుండానే బిజెపి ప్రభుత్వం ప్రభుత్వాలు ఏర్పాటు చేసుకుని కుట్రలు పన్నుతుందని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు అన్నారు.దాని ఫలితంగా పేదల పథకాలు కోల్పోతున్నారని పేదలకు రక్షణ దక్కాలంటే భారత రాజ్యాంగం చిరస్థాయిగా బ్రతికించుకోవాల్సి ఉండాల్సిందేనన్నారు.ప్రజలకు సేవ చేసే సత్తా లేనోడు భారత రాజ్యాంగాన్ని మారుస్తామని పదేపదే ప్రకటిస్తుండడం సన్నాసులు పలికే మాటలని గుర్తు చేశారు.గొంతులో ప్రాణం ఉన్నంతవరకు భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని భారత ప్రధాని నరేంద్ర మోడీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి పలు సందర్భాల్లో ప్రమాణం చేసిన మాటలను,ప్రతిజ్ఞలను అప్పుడే మర్చిపోతే ఎట్లా అన్నారు.దేశాన్ని రక్షించాలనే ఆలోచన కన్నా దేశాన్ని నిర్వీర్యం చేయాలని ఆలోచన పాలకులకు పెద్ద ఎత్తున తోస్తున్నట్లుగా దేశ పాలన సాగుతుందన్నారు.రాజ్యాంగాన్ని మార్చాలనుకునే ముందు బిజెపి ప్రభుత్వాన్ని రద్దు పరచు కొండంటూ హితవు పలికారు.ప్రజలు వేయని ఓట్లతో గద్దెనెక్కి దర్జాగా దేశాన్ని ఏలుతున్నారని మండిపడ్డారు.భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా భారత జాతీయత మీద దెబ్బకొట్టాలని చూస్తున్నారని దానిని దేశ ప్రజలు ఇప్పటికీ గ్రహించలేకపోవడం బాధాకరమన్నారు.దేశంలో ఉన్న 140 కోట్ల జనంతో పాటు పుట్టబోయే ప్రతి బిడ్డ మీద 1.4 కోట్ల అప్పు చేసి పెట్టిన కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అభివృద్ధి పరుస్తున్నామని కల్లిబొల్లి కబుర్లతో కూడిన మాటలను తీయ్యగా పలుకుతుందన్నారు.స్వాతంత్ర్యం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ఎప్పుడు వసూళ్లకు పాల్పడలేనంతగా ప్రస్తుతం దేశంలో కేంద్ర ప్రభుత్వం అత్యధికమైన పన్నులను వివిధ రూపాల్లో వసూలు చేస్తుందని అయినప్పటికిని దేశం 200 లక్షల కోట్ల అప్పుకు చేరువైంది తప్ప అప్పుల భారం మాత్రం ఏమాత్రం తగ్గడం లేదన్నారు.కేంద్ర ప్రభుత్వం వసూళ్లకు పాల్పడుతున్న పన్నుల రూపంలోని విలువైన సొమ్ము ఎటు దారి మళ్లించబడుతుందని సూటిగా ప్రశ్నించారు.ప్రజలు చెల్లిస్తున్న పన్నులు ప్రజలకు దక్కాలి గాని పారిశ్రామికవేత్తలకు దక్కుతుండడం దేశ ఆర్థిక స్థితిగతులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది అన్నారు.బేవర్స్ లెక్కలతో దేశాన్ని దోచుకునుడు తప్ప దేశానికి ఒరుగబెట్టిందేమీ లేదన్నారు.భారత రాజ్యాంగాన్ని,సుప్రీంకోర్టును గౌరవించని బిజెపికి దేశాన్ని పాలించే హక్కు లేదన్నారు.రాజ్యాంగాన్ని మార్చాలనుకునే ముందు ఈవీఎం ఎన్నికల పద్ధతిని రద్దు పరచి దానిని అమలుపరిచి బ్యాలెట్ ఎన్నికలకు వచ్చే సత్తా కేంద్ర ప్రభుత్వానికి ఉందా అంటూ సూటిగా నిలదీశారు.దేశ భద్రతకు ఆటం కాలు సృష్టించాలనుకోవడం దేశాన్ని పాలిస్తున్న నాయకుల లక్షణమా అంటూ నిలదీశారు.ప్రస్తుతం దేశంలో కొనసాగుతున్న రాజ్యాంగ రక్షణ పోరాటం జై భీమ్ నినాదం కేవలం భారతదేశాన్ని మాత్రమే కాదని ప్రపంచాలు సైతం జై భీమ్ నినాదాన్ని జపిస్తూ రాజ్యాంగ రక్షణ కోసం పాటుపడుతున్నాయి అన్నారు.భారతదేశం ఉపరితలంపై ఉన్న దేశాలు రాజ్యాంగ రక్షణ కోసం పాటుపడుతుంటే దేశాన్ని పాలిస్తున్న పెద్దమనుషులు భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటూ నకిలీ మాటలు మాట్లాడుతున్నారన్నారు.దేశ ప్రజల ఓపికను పరీక్షించడం కేంద్ర ప్రభుత్వానికి ఎంత మాత్రం మంచిది కాదని గుర్తు చేస్తూ దేశ జాతీయత మీద ఏమాత్రం గౌరవమున్న భారత రాజ్యాంగం జోలికి రాకూడదని హితవు పలికారు.రాజ్యాంగాన్ని మార్చాలనుకునే కుట్రలు పన్నితే దేశం రణరంగమయ్యే ఆస్కారం ఉందని దేశాన్ని పాలిస్తున్న కొంతమంది నకిలీ నాయకులు గుర్తించాలన్నారు.భారత రాజ్యాంగం అనే గ్రంథం భారతదేశంలోని ప్రతి పౌరుని ఆత్మ గౌరవన్న సంగతిని ప్రభుత్వాలు ప్రతిపక్షాలు దేశ ప్రజలు గుర్తెరగాలన్నారు.

## ప్రజల విశ్వాసంతో మడిపల్లి సర్పంచ్ ఉప సర్పంచ్‌లుగా బుర్ర రంజిత్ కుమార్ - కాందారి ప్రదీప్ లు ఎన్నిక

**హసన్‌పర్తి, 14 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**





తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన గ్రామపంచాయతీ రెండవ విడత ఎన్నికల్లో హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామ సర్పంచ్‌గా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బుర్ర రంజిత్ కుమార్ ప్రజల ఘన మద్దతుతో గెలుపొందారు. ఈ ఎన్నికల ఫలితం మడిపల్లి గ్రామ ప్రజలు అభివృద్ధి, పారదర్శక పాలనతో పాటు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకత్వాన్ని కోరుకుంటున్నారనే విషయాన్ని స్పష్టంగా ప్రతిబింబించింది. ప్రశాంత వాతావరణంలో జరిగిన పోలింగ్‌కు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మహిళలు, యువత, వృద్ధులు ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొనడం గ్రామ ప్రజాస్వామ్య చైతన్యానికి నిదర్శనంగా నిలిచింది. ఎన్నికల ప్రచారం మొత్తం కాలంలో బుర్ర రంజిత్ కుమార్ అతి ఆర్భాటం లేకుండా ప్రజల మధ్యే తిరుగుతూ ప్రతి ఇంటిని సందర్శించారు. గ్రామంలోని తాగునీటి సమస్య, అంతర్గత రహదారుల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, పారిశుధ్య సమస్యలు, వీధి దీపాల కొరత, ప్రభుత్వ పథకాల అమలులో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలను ప్రజలకు వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, యువతకు ఉపాధి అవకాశాల కల్పన, విద్యా మరియు ఆరోగ్య సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇవ్వడం ప్రజల్లో ఆయనపై విశ్వాసాన్ని మరింత బలపరిచింది. బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల్లో ఉన్న నమ్మకం కూడా ఈ గెలుపుకు ప్రధాన కారణంగా నిలిచింది. స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన కలిగిన అభ్యర్థిగా బుర్ర రంజిత్ కుమార్ గ్రామ ప్రజల మన్ననలు పొందారు. ఫలితాలు వెలువడిన వెంటనే మడిపల్లి గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరించాయి. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరి మిఠాయిలు పంచుకుంటూ, పటాసులు కాల్చుతూ విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. గెలుపు అనంతరం బుర్ర రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఈ విజయం తన వ్యక్తిగత గెలుపు కాదని, మడిపల్లి ప్రజల విశ్వాసానికి ప్రతీక మాత్రమేనని పేర్కొన్నారు. ప్రజలందరినీ కలుపుకొని పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ప్రాధాన్య క్రమంలో అభివృద్ధి పనులు ప్రారంభించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం, అంతర్గత రహదారులు మరియు సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం, మహిళలు%-%యువత కోసం స్వయం ఉపాధి కార్యక్రమాలు అమలు చేయడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో మడిపల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా కాందారి ప్రదీప్ ఘన విజయం సాధించగా, వార్డు సభ్యులుగా ఎర్ర రణదేవ్, బుర్ర రాజు, గాదం సంధ్యారాణి, జక్కుల శ్రావణ్ కుమార్, బుర్ర ఉమాదేవి, ముంజ సంతోష్, వల్లెపు ఐలయ్య, కాందారి కళ్యాణి, కాందారి శ్రీ విద్యలు విజయం సాధించారు. నూతన పాలకవర్గం ఏర్పడటంతో గ్రామంలో అభివృద్ధిపై ఆశలు మరింత బలపడ్డాయి. బుర్ర రంజిత్ కుమార్ సర్పంచ్‌గా ఎన్నిక కావడంతో మడిపల్లి గ్రామంలో కొత్త ఆశలు చిగురించాయి. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే నాయకత్వం లభించిందన్న విశ్వాసం గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మడిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానన్న ఆయన సంకల్పంతో ఈ గెలుపు గ్రామ భవిష్యత్తుకు కొత్త దిశను చూపుతుందన్న అభిప్రాయం బలంగా వ్యక్తమవుతోంది.


## ప్రధాని మోదీ నమ్మకాన్ని వమ్ము చేయను

### బీజేపీ నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్

**ఢిల్లీ, జై భీమ్ న్యూస్**

బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీహార్ మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్ నబిన్‌ను నియమిస్తూ బీజేపీ పార్లమెంటరీ బోర్డు ఆదివారం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియడంతో పార్టీ ఈ మార్పు చేపట్టింది. కాగా, అత్యంత పిన్న వయస్కుడైన బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీనే కావడం విశేషం. ఆయన వయసు 45 సంవత్సరాలు. ఈ సందర్భంగా నితిన్ నబిన్ మాట్లాడుతూ, తనకు ఇంతటి కీలక బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీ, సీనియర్ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ, ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. "దేశవ్యాప్తంగా పార్టీ విజయాల వెనుక కార్యకర్తల కఠోర శ్రమ ఉంది. నా లాంటి నాయకులతో పాటు ప్రధాని మోదీకి కూడా వారే అసలైన బలం" అని 45 ఏళ్ల నితిన్ వ్యాఖ్యానించారు. అనంతరం ఢిల్లీలో జరిగిన ఓ ర్యాలీలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. "గతంలో కూడా మనం చూశాం. ప్రధాని మోదీని ఎంతగా దూషిస్తే, ఆయన సునామీ అంతగా పెరుగుతారు. మరింత భారీ మెజారిటీతో ఆయన విజయం సాధిస్తారు" అని నితిన్ నబిన్ అన్నారు. పాట్నాలోని బంకీపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న నితిన్ నబిన్, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చారు. ఆయన తండ్రి నవీన్ కిశోర్ ప్రసాద్ సిన్హా బీహార్ బీజేపీలో సీనియర్ నేతగా గుర్తింపు పొందారు. విద్యార్థి రాజకీయాల నుంచి రాష్ట్ర మంత్రి పదవి వరకు అంచెలంచెలుగా ఎదిగిన నితిన్, క్రమశిక్షణ గల కార్యకర్తగా పార్టీలో మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు.


# జై భీమ్ టీవీ రిపోర్టర్ నుంచీ హైకోర్టు అడ్వకేట్‌గా గాలిగల్ల సాయిబాబా



పేదలు, యువత, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయసేవలు అందిస్తా : సాయిబాబా

**మేడ్చల్ - మల్కాజ్‌గిరి, (జై భీమ్ న్యూస్)**

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ, యాద్గార్పల్లి వార్డు కార్యాలయంలో గాలిగల్ల కృష్ణ-సుమిత్రల కుమారుడు గాలిగల్ల సాయిబాబా తెలంగాణ రాష్ట్ర గౌరవ హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేసిన శుభ సందర్భంగా కుటుంబ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గాలిగల్ల సాయిబాబా మాట్లాడుతూ "ప్రతి అడుగులో నా ఎదుగుదలకు స్ఫూర్తినిచ్చి ఈ స్థాయికి తీసుకొచ్చిన తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. పేద ప్రజలు, యువత, అణగారిన వర్గాలకు న్యాయం జరిగేలా న్యాయవాదిగా నా వృత్తిని అంకితభావంతో నిర్వహిస్తాను. ఈ ప్రయాణంలో నాకు చదువు చెప్పిన గురువులకు, మద్దతుగా నిలిచిన మిత్రులు, శ్రేయోభిలాషులు, కష్టసమయంలో అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు" అని అన్నారు. జర్నలిస్టు నుంచి హైకోర్టు న్యాయవాదిగా తన ప్రయాణం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్న సాయిబాబాజర్నలిస్టుగా పని చేసిన కాలంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, పేదలకు జరిగిన అన్యాయాలపై పోరాటం, రాష్ట్రవ్యాప్తంగా అనేక సమస్యలపై క్రియాశీలక పాత్ర పోషించడం తనకు గొప్ప అనుభవమని తెలిపారు. ఆ సేవా దృక్పథాన్ని న్యాయవాదిగా కూడా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొని గాలిగల్ల సాయిబాబాకు అభినందనలు తెలియజేశారు. అలాగే జైభీమ్ టీవీ ఛానల్ సీఈఓ & చైర్మన్ డా. బరిగెల శివ గారికి ప్రోత్సాహం, మార్గదర్శకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ"జర్నలిస్టు నుంచి హైకోర్టు న్యాయవాదిగా ప్రమాణస్వీకారం చేయడం ఎంతో ఆనందంగా ఉంది" అని గాలిగల్ల సాయిబాబా పేర్కొన్నారు.




# వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో కలకలం

ఆర్థో సర్జరీ చేసిన పేషెంట్‌ను కరిచిన ఎలుకలు!

**వరంగల్, 14 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

వరంగల్ నగరంలోని ప్రభుత్వ ఎంజీఎం ఆసుపత్రిలో తీవ్ర నిర్లక్ష్యానికి అద్దం పట్టే సంఘటన వెలుగులోకి వచ్చింది. ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స చేయించుకున్న ఓ పేషెంట్‌ను ఆసుపత్రి వార్డులో ఎలుకలు కరిచిన ఘటన కలకలం రేపుతోంది. ఈ ఘటనతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరిశుభ్రత, భద్రతపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే, ఇటీవల ఎంజీఎం ఆసుపత్రిలో ఆర్థోపెడిక్ సర్జరీ చేయించుకున్న ఓ పేషెంట్ కోలుకుంటున్న దశలో ఉండగా, వార్డులో ఉన్న సమయంలో ఎలుకలు కరిచినట్లు పేషెంట్ బంధువులు ఆరోపిస్తున్నారు. శస్త్రచికిత్స జరిగిన భాగం సమీపంలోనే కాటు గాయాలు ఏర్పడటంతో ఇన్ఫెక్షన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనను బయటకు రాకుండా చేయడానికి ఆసుపత్రి సిబ్బంది గుట్టుచప్పుడు కాకుండా పేషెంట్‌కు టీటీ (టెటనస్ టాక్సాయిడ్) ఇంజెక్షన్ ఇచ్చి, పరిస్థితి సీరియస్ కాకముందే ఇంటికి పంపే ప్రయత్నం చేశారని పేషెంట్ బంధువులు ఆరోపిస్తున్నారు. పేషెంట్‌కు పూర్తిస్థాయి చికిత్స అందించకుండా, బాధ్యత తప్పించుకునేలా వ్యవహరించారని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలుక కాటు వల్ల ఇన్ఫెక్షన్ ఏర్పడితే పేషెంట్ ప్రాణాలకు కూడా ప్రమాదం ఉండొచ్చని తెలిసే ఈ విధంగా ఇంటికి పంపిస్తున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో సరైన పరిశుభ్రత లేకపోవడం, ఎలుకల బెడదను నియంత్రించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వారు విమర్శించారు. ఈ ఘటన సమాచారం బయటకు రావడంతో ఆసుపత్రి ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. పేషెంట్ బంధువులు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు ఆసుపత్రి యాజమాన్యం ఈ ఘటనపై ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల భద్రతకు గట్టి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి నిర్లక్ష్య ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే ఉన్నతాధికారులు విచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉండగా, అధికారుల స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.




## విద్యార్థులు ప్రతిరోజూ నేర్చుకునే మార్గంలో వేసే ప్రతి అడుగు వారి భవిష్యత్తును రూపొందిస్తోంది



**బెంగళూరు జై భీమ్ న్యూస్:**

విద్యార్థులు ప్రతిరోజూ నేర్చుకునే మార్గంలో వేసే ప్రతి అడుగు వారి భవిష్యత్తును రూపొందిస్తోంది. కృషి, క్రమశిక్షణ మరియు ఆత్మవిశ్వాసం విజయానికి నిజమైన సూత్రాలు అని మణిపాల్ హాస్పిటల్ చైర్‌పర్సన్ డాక్టర్ మాబుల్ వాస్నాయక్ అన్నారు. కటంనల్లూరులోని నారాయణ ఒలింపియాడ్ స్కూల్, "ఐక్యం ప్రతి అడుగులో ఐక్యత" అనే ఇతివృత్తంతో జరిగిన పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మార్కులతో పాటు విలువలను, పోటీతో పాటు సహకారాన్ని, జ్ఞానంతో పాటు మానవత్వాన్ని పెంపొందించుకోండి. మీరు ఐక్యత, సృజనాత్మకత మరియు ఉత్సాహాన్ని మీ జీవితంలో భాగం చేసుకుంటే, మీరు ఏ సవాలునైనా అధిగమించవచ్చు. తప్పుల నుండి నేర్చుకోండి, ఓటమిని పాఠంగా అంగీకరించండి మరియు మీ కలలను సాధించడానికి ధైర్యంగా ముందుకు సాగండి అని ఆయన అన్నారు. ఇఎస్ఐ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆల్బర్ట్ డేవిడ్ సి. మాట్లాడుతూ, మీరు ఈ రోజు నేర్చుకుంటున్న పాఠాలు రేపు సమాజానికి మీరు చేసే సహకారం అవుతాయని అన్నారు. తమను తాము నమ్ముకోవాలని, వారి ప్రయత్నాలకు విలువ ఇవ్వాలని మరియు దేశం గర్వించదగిన పౌరులుగా మారే మార్గంలో కొనసాగాలని ఆయన వారికి సూచించారు. పబ్లిక్ స్పీకింగ్ మరియు నాయకత్వ కార్యకలాపాలతో సహా వివిధ రంగాలలో రాణించిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ గ్రూప్ డైరెక్టర్ సింధు, నారాయణ గ్రూప్ అధ్యక్షుడు పునీత్, స్కూల్ ప్రిన్సిపాల్ పవనార్క్, ఎజిఎం శ్రీనివాసులు, అకడమిక్ హెడ్ పవన్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్







**హన్మకొండ, డిసెంబర్ 14, 2025(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం పరకాల మండలం నాగారం, వెల్లంపల్లి గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్ ప్రక్రియపై ఎన్నికల అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నాగారం గ్రామంలో పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది సంఖ్యపై ఇన్స్పెక్టర్‌ను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించి, ఓట్ల లెక్కింపు కోసం చేపట్టిన ఏర్పాట్లను రిటర్నింగ్ అధికారుల ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ, ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కౌంటింగ్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పోలింగ్ మెటీరియల్ భద్రత విషయంలో రిటర్నింగ్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లు, పోలింగ్‌కు సంబంధించిన వివరాలను ఎంపీడీవో విమల జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ డాక్టర్ కన్నం నారాయణ, తహసిల్దార్ విజయలక్ష్మి, ఏసిపి సతీష్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రెండవ విడత గ్రామపంచాయతీ పోలింగ్ కేంద్రాల పరిశీలన

వరంగల్ సీపీ సన్‌ప్రీతిసింగ్






**వరంగల్, 14 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం నిర్వహిస్తున్న గ్రామపంచాయతీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ సందర్భంగా భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సన్‌ప్రీతిసింగ్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా జనగామ జిల్లాలోని శామీర్‌పేట, బచ్చన్నపేట, నర్మెట్ట, మచ్చు పహాడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సీపీ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులు, ఓటర్లకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. పోలింగ్, అనంతరం జరిగే ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు కమిషనర్ స్పష్టమైన సూచనలు, సలహాలు అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమ నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీల్లో సీపీ వెంట డీసీపీలు కుమార్, రాజమహేంద్ర నాయక్, ఏసీపీలు చైతన్య, నర్సయ్య, రమణబాబు తో పాటు సంబంధిత ప్రాంతాల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

ఫర్టిలైజర్ షాప్‌లో మంటలు, భారీ ఆస్తి నష్టం

**హైద్రాబాద్, 14 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**



వికారాబాద్ జిల్లా ధారూర్ మండల కేంద్రంలో ఆదివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాప్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో తీవ్ర కలకలం ఏర్పడింది. అగ్ని ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలు ఆకాశాన్ని అంటుతూ చుట్టుపక్కల ప్రాంతాల్లో భయాందోళన సృష్టించాయి. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడైంది. మంటలు ఎగసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై నీటితో మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మరోవైపు పోలీసులు కూడా సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. షాప్ నిర్వాహకులకు ప్రమాద సమాచారం అందజేసి భద్రతా చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉండగా, పరిస్థితిని పూర్తిగా నియంత్రణలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు.

## ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు పురస్కారం బండారి రాజ్ కుమార్‌కు ప్రదానం

**వరంగల్, డిసెంబర్ 14, 2025 (జై భీమ్ న్యూస్)**




అరసం వరంగల్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం హనుమ కొండలోని ఫాతిమా స్కూల్‌లో ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు పురస్కార ప్రదానం సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో "తెలంగాణ కవి ముద్ర" గ్రంథ రచయిత బండారి రాజ్ కుమార్కు ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు పురస్కారాన్ని అందజేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ మేధావి, రచయిత ప్రొఫెసర్ బన్న అయిలయ్య మాట్లాడుతూ, తెలంగాణ సాహిత్యానికి, సామాజిక చైతన్యానికి బండారి రాజ్ కుమార్ చేసిన కృషిని ప్రశంసించారు. సాహిత్యం ప్రజల జీవితాలను ప్రభావితం చేసే శక్తివంతమైన సాధనమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, రచయితలు, మేధావులు, విద్యార్థులు, సాహిత్యాభిమానులు పాల్గొని సభను విజయవంతం చేశారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# ములుగు జిల్లాలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం





**82.93 శాతం పోలింగ్ నమోదు**

**ములుగు, డిసెంబర్ 14, 2025 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో నిర్వహించిన రెండవ విడత సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. రెండవ విడతలో వెంకటాపూర్, ములుగు, మల్లంపల్లి మండలాల్లో మొత్తం 37 సర్పంచ్ స్థానాలకు, 315 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించగా, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పోలీసు విభాగం సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. రెండవ విడత ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్ మండలాల్లో పోలింగ్ నిర్వహించగా, జిల్లావ్యాప్తంగా మొత్తం 54,944 ఓట్లు ఉండగా 45,565 ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 82.93 శాతం పోలింగ్ నమోదు అయిందని కలెక్టర్ వివరించారు. మండలాల వారీగా పరిశీలిస్తే మల్లంపల్లి మండలంలో మొత్తం 10,883 ఓటర్లకు గాను 9,265 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 85.13 శాతం పోలింగ్ నమోదు కాగా, ములుగు మండలంలో మొత్తం 20,470 ఓటర్లకు గాను 16,479 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 80.50 శాతం పోలింగ్ నమోదైంది. వెంకటాపూర్ మండలంలో మొత్తం 23,591 ఓటర్లకు గాను 19,821 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 84.02 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సమయంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించారని అన్నారు. ఈ నెల 17వ తేదీన జరగనున్న మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు ఎన్నికల సంఘం, జిల్లా యంత్రాంగం సూచనలు పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మూడవ విడత ఎన్నికలు జరగనున్న కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమాలు ఈ నెల 15వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు ముగుస్తాయని తెలిపారు. ప్రచారం ముగిసిన అనంతరం సైలెన్స్ పీరియడ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేయాలని అన్ని శాఖల నోడల్ అధికారులను ఆదేశించారు. అలాగే ఈ నెల 15వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు సంబంధిత మండలాల్లో మద్యం షాపులు, కల్లు దుకాణాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రశాంతంగా ముగిసిన రెండవ విడత పోలింగ్

**ఓటుహక్కు వినియోగమే**
**ప్రజాస్వామ్య బలానికి పునాది**

**హన్మకొండ, 14 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

జిల్లాలో నిర్వహించిన రెండవ విడత ఎన్నికల పోలింగ్ పూర్తిగా ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగింది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సందడి కనిపించగా, యువత, మహిళలు, వృద్ధులు ఉత్సాహంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం అనేక చోట్ల ఓటర్లు తమ వేలిపై ఉన్న సిరా గుర్తును చూపిస్తూ ప్రజాస్వామ్యంపై తమ నమ్మకాన్ని వ్యక్తం చేశారు. పోలింగ్ ప్రారంభమైన నాటినుంచి జిల్లా ఎన్నికల యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించింది. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, షెడ్లు, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి మౌలిక వసతులు సమృద్ధిగా ఏర్పాటు చేయడంతో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం ప్రజల మన్ననలను పొందింది. గ్రామాలు, పట్టణాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచే ఓటర్ల క్యూలు దర్శనమిచ్చాయి. కుటుంబాలుగా వచ్చి ఓటు వేయడం ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని, బాధ్యతను చాటింది. ముఖ్యంగా యువ ఓటర్లు పెద్ద సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనడం ఎన్నికల పట్ల పెరుగుతున్న అవగాహనకు నిదర్శనంగా నిలిచింది. ఎన్నికల సందర్భంగా




అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ఓటుహక్కు ప్రాధాన్యతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. "ప్రతి ఓటు విలువైనది ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఓటుహక్కు వినియోగమే కీలకం" అంటూ ప్రజలను పోలింగ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పిలుపు ప్రభావం పోలింగ్ సరళిలో స్పష్టంగా కనిపించిందని అధికారులు పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టి పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు సమీక్షించగా, పోలింగ్ సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వహించడంతో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా కొనసాగింది. భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండటంతో ఓటర్లు ఎలాంటి భయాందోళన లేకుండా నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. రెండవ విడత పోలింగ్ ప్రశాంతంగా ముగియడం ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందని అధికారులు తెలిపారు. ప్రతి పౌరుడు తన ఓటుహక్కును వినియోగించుకున్నప్పుడే ప్రజాపాలన సార్థకమవుతుందని మరోసారి స్పష్టం చేస్తూ, "ఓటు హక్కు కేవలం హక్కే కాదు%ౌ% అది ప్రతి పౌరుడి బాధ్యత" అని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలలోనూ ఇదే ఉత్సాహం కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఆస్ట్రేలియాలోని బాండీ బీచ్ లో కాల్పులు... 10 మంది మృతి

**సిడ్నీలోని ప్రఖ్యాత బాండీ బీచ్‌లో కాల్పులు**
**ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని పోలీసుల హెచ్చరిక**
**ఇద్దరు దుండగులు కాల్పులకు పాల్పడినట్టు సమాచారం**
**కాల్పుల శబ్దాలతో పరుగులు తీసిన పర్యాటకులు**

ఆస్ట్రేలియ, జై భీమ్ న్యూస్

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో కాల్పుల కలకలం రేగింది. ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన బాండీ బీచ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో కనీసం 10 మంది మరణించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు, భారీ భద్రతను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ప్రజలు అటువైపు రావొద్దని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6:45 గంటల సమయంలో బాండీ బీచ్‌లో పలువురిపై కాల్పులు జరిగాయని సమాచారం అందడంతో న్యూ సౌత్ వేల్స్ అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించి, సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఇది ఇంకా కొనసాగుతున్న ఘటన అని, సమీప ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకోవాలని పోలీసులు సూచించారు. కాల్పుల శబ్దాలు, పోలీసు సైరన్లతో బాండీ బీచ్ ప్రాంతం దద్దరిల్లింది. ప్రాణభయంతో పర్యాటకులు, స్థానికులు



పరుగులు తీస్తున్న దృశ్యాలతో కూడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నల్ల దుస్తులు ధరించిన ఇద్దరు వ్యక్తులు బాండీ బీచ్‌లోని ఒక వంతెన వద్ద కాల్పులు జరిపినట్టు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై ప్రధాని ఆంథోనీ అల్బనీస్ కార్యాలయం స్పందించింది. పరిస్థితిని సమీక్షిస్తున్నామని, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని కోరింది. ప్రస్తుతం పోలీసులు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించారు. ఇద్దరు దుండగుల్లో ఒకరిని భద్రతా బలగాలు హతమార్చాయి.

## మడికొండలో నిషేధిత గుట్కాపై పోలీసుల దాడులు

**రూ.10,640 విలువైన సరుకు స్వాధీనం.. రెండు కేసులు నమోదు**

**మడికొండ, డిసెంబర్ 14 (జై భీమ్ న్యూస్)**

మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కా విక్రయాలపై పోలీసులు దాడులు నిర్వహించి, రెండు వేర్వేరు ఘటనల్లో నిషేధిత గుట్కాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. డిసెంబర్ 14న మధ్యాహ్నం సుమారు 1 గంటల సమయంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్ రావు గస్తీ నిర్వహిస్తున్న క్రమంలో కాలనీ రోడ్ నంబర్%-%5 వద్ద గుట్కా అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి బాబా బిగ్ ప్యాకెట్లు, జేకే ప్యాకెట్లు, జూహి స్మాల్ ప్యాకెట్లతో కలిపి మొత్తం రూ.4,820 విలువైన నిషేధిత గుట్కా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై క్రైం నెం. 322/2025గా కేసు నమోదు చేశారు. అదే రోజు మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో ఏఎస్ఐ ఎన్. మహిపాల్ రెడ్డి సిబ్బందితో కలిసి కాలనీ రోడ్ నంబర్%-%4 (కడవెంక) ప్రాంతంలో తనిఖీలు నిర్వహించగా, మరో వ్యక్తి గుట్కా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి అంబర్, ఆర్ఆర్, అనర్ ప్యాకెట్లు, ఆర్ఆర్ బిగ్ ప్యాకెట్లు కలిపి రూ.5,820 విలువైన నిషేధిత గుట్కా స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై క్రైం నెం. 327/2025గా కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లోనూ బిఎన్ఎస్ సెక్షన్ 271, 275ల కింద దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. నిషేధిత గుట్కా విక్రయాలు ప్రజారోగ్యానికి తీవ్ర హానికరమని, ఇలాంటి అక్రమాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు





**హన్మకొండ, డిసెంబర్ 14, 2025 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నిర్వహిస్తున్న పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలను జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు ఆదివారం పరిశీలించారు. హసన్‌పర్తి మండలం నాగారం, ఐనవోలు మండలం పంథిని, పున్నేలు, ఐనవోలులోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని ఆయన పరిశీలించారు. అలాగే పరకాల మండలం నాగారంలో కొనసాగుతున్న కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించి, పారదర్శకంగా, నియమావళికి అనుగుణంగా నిర్వహించాలని అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, డిసిఒ సంజీవరెడ్డి, తహసిల్దార్లు కిరణ్ కుమార్, విక్రమ్ కుమార్, ఎంపీడీవోలు సుమనవాణి, నర్మదతో పాటు ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరీష్

**హన్మకొండ, 14 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**



రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి ప్రారంభమైంది. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ లో, ఐనవోలు మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగుతుండగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. వార్డులు, సర్పంచులకు వచ్చిన ఓట్లను ఎన్నికల అధికారులు కౌంటింగ్ చేస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాలలో ఎన్నికల అధికారులు, అభ్యర్థుల తరఫున హాజరైన ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాగుతుండగా కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్మసాగర్ లో డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఎంపీడీఓ అనిల్ కుమార్, తహసిల్దార్ సదానందం, ఇతర అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియను పరిశీలించగా, ఐనవోలులో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, తహసిల్దార్ విక్రమ్ కుమార్, ఎంపీడీవో నర్మద, ఇతర అధికారులు ఉన్నారు.





# పెళ్లి తర్వాత తొలిసారి..


## కెమెరాలకు చిక్కిన సమంత-రాజ్ జంట

**దర్శకుడు రాజ్ నిడిమోరును వివాహం చేసుకున్న నటి సమంత**
**పెళ్లి తర్వాత తొలిసారి ముంబై ఎయిర్‌పోర్టులో జంటగా ప్రత్యక్షం**
**ఈ నెల 1న కోయంబత్తూర్ ఇషా ఫౌండేషన్‌లో వీరి వివాహం**
**ప్రస్తుతం 'రక్త్ బ్రహ్మాండ్' వెబ్ సిరీస్‌లో కలిసి పనిచేస్తున్న జంట**

దర్శకుడు రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత నటి సమంత తొలిసారిగా బహిరంగంగా కనిపించారు. శనివారం మధ్యాహ్నం ముంబై విమానాశ్రయం నుంచి బయలుదేరుతున్న సమయంలో ఈ నూతన జంట కెమెరాల కంటపడింది. చాలా సింపుల్‌గా, సాధారణ దుస్తుల్లో కనిపించిన వీరిని చూసి ఫోటోగ్రాఫర్లు శుభాకాంక్షలు తెలిపారు. దానికి వారు చిరునవ్వుతో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నెల 1న కోయంబత్తూర్‌లోని ఇషా ఫౌండేషన్‌లో సమంత, రాజ్ అతికొద్ది మంది కుటుంబ సభ్యులు, మిత్రుల సమక్షంలో లింగ భైరవ సంప్రదాయంలో వివాహం చేసుకున్నారు. ఈ విషయాన్ని సమంత స్వయంగా సోషల్ మీడియా ద్వారా ఓ పోస్ట్‌తో ధ్రువీకరించారు. ఎలాంటి ఆర్భాటం లేకుండా జరిగిన వీరి పెళ్లి వార్త అందరినీ ఆశ్చర్యపరిచింది. గత ఏడాది నుంచి వీరిద్దరి మధ్య ప్రేమాయణం నడుస్తోందంటూ పుకార్లు వినిపిస్తున్నా, వారు ఎప్పుడూ అధికారికంగా స్పందించలేదు. 'ది ఫ్యామిలీ మ్యాన్ 2' సిరీస్ సెట్‌లో మొదలైన వీరి పరిచయం, 'సిటాడెల్: హనీ బన్నీ' ప్రాజెక్ట్ సమయంలో ప్రేమగా మారిందని తెలుస్తోంది. అంతకుముందు సమంత, నటుడు నాగ చైతన్యను వివాహం చేసుకొని విడిపోయారు. అటు రాజ్ నిడిమోరుకు కూడా 2015లో వివాహం కాగా, 2022లో విడిపోయినట్లు ప్రచారం జరిగింది. ప్రస్తుతం రాజ్ అండ్ డీకే దర్శకత్వంలో రూపొందుతున్న 'రక్త్ బ్రహ్మాండ్' అనే వెబ్ సిరీస్‌లో సమంత నటిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# పవన్ పాటకు వ్యూస్ వెల్లువ... ఇప్పుడు ఇదే ట్రెండింగ్!

**ఉస్తాద్ భగత్‌సింగ్ నుంచి నిన్న విడుదలైన 'దేఖ్ లేంగే' పాట**
**విడుదలైన 15 గంటల్లోనే 20 మిలియన్ల వ్యూస్ సాధించిన పాట**
**యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో దూసుకెళుతున్న వైనం**
**24 గంటల వ్యూస్ రికార్డుపై అందరి దృష్టి**
**రామ్ చరణ్ పాట రికార్డును బద్దలు కొట్టే అవకాశం!**




పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి విడుదలైన 'దేఖ్ లేంగే సాలా' పాట యూట్యూబ్‌లో సంచలనం సృష్టిస్తోంది. శనివారం సాయంత్రం విడుదలైన ఈ పాట, కేవలం 15 గంటల్లోనే 25 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి రికార్డుల దిశగా దూసుకెళుతోంది. ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో కొనసాగుతున్న ఈ పాటను సంగీత ప్రియులు రిపీట్ మోడ్‌లో వింటున్నారు. నిన్న విడుదలైన కొద్ది సమయంలోనే 13 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించడం పవన్ కల్యాణ్ క్రేజ్‌కు నిదర్శనమని అభిమానులు భావిస్తున్నారు. ఈ వేగంతో 24 గంటల్లో సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో, టాలీవుడ్‌లో తొలి 24 గంటల్లో అత్యధిక వ్యూస్ సాధించిన పాటల జాబితాపై చర్చ మొదలైంది. ప్రస్తుతం ఈ జాబితాలో రామ్ చరణ్ సినిమాలోని 'చికిరి చికిరి' పాట 29.19 మిలియన్ వ్యూస్‌తో అగ్రస్థానంలో ఉంది. 'పుష్ప 2' చిత్రంలోని 'కిసిక్' పాట 27.19 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ రికార్డును అధిగమించాలంటే 'దేఖ్ లేంగే సాలా' పాట మిగిలిన సమయంలో మరో 10 మిలియన్ల వ్యూస్ సాధించాల్సి ఉంటుంది. మరి పవన్ పాట ఈ ఫీట్‌ను అందుకుని కొత్త చరిత్ర సృష్టిస్తుందా లేదా అనేది మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.



# సంస్కృతి-సంప్రదాయాల సమ్మేళనం

## - ప్రగ్న్య హాఫ్ సారె వేడుక అద్భుతం

**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

హైదరాబాద్ నగరంలోని సన్ సిటీ బండ్లగూడ ప్రాంతంలో ఉన్న కీర్తన కన్వెన్షన్ వేదికగా, కొమ్ము నరేందర్ గారి కూతురు ప్రగ్న్య హాఫ్ సారె వేడుకను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు,ఆహ్వానిత అతిథుల సమక్షంలో సంప్రదాయ పద్ధతుల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్పాల అలంకరణలు, కళాత్మక డెకరేషన్‌తో ముస్తాబైన వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హాఫ్ సారె ధరించిన ప్రగ్న్య సంప్రదాయ సౌందర్యంతో మెరిసి, హాజరైన వారందరి మనసులను ఆకట్టుకుంది. కార్యక్రమం మొత్తం ఆనందోత్సాహాలు, ఆధ్యాత్మిక వాతావరణంతో కొనసాగింది. ఈ శుభ సందర్భంగా జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ ప్రగ్న్యను హృదయపూర్వకంగా ఆశీర్వదించి,ఆమె భవిష్యత్తు సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు.అలాగే ఎర్రోళ ప్రవీణ్, నరేష్,ఆనంద్ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుక కుటుంబ సభ్యులకు మాత్రమే కాకుండా, హాజరైన ప్రతి ఒక్కరికీ మరపురాని మధుర జ్ఞాపకంగా నిలిచింది.

# పోలీసులు ప్రజా సేవకులు








**ప్రజాస్వామ్యానికి పరిరక్షకులు**
**పేద ప్రజలకు ఆపద్బాంధవులు**
**సర్పంచ్ ఎన్నికలలో అత్యంత విలువైన సేవలు అందించారు**
**అడిషనల్ కమాండెంట్ ఆఫ్ పోలీస్ శ్రీనివాస్ సేవలు అద్భుతం**
**ప్రజా సేవలో మరోసారి ఉదారతను చాటుకున్న సిటీ గార్డ్స్**

**వేలేరు జై భీమ్ న్యూస్:-**

క్లిష్ట సమయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండడం పోలీస్ అధికారులు బాధ్యతగా స్వీకరిస్తారని తెలపడానికి నిదర్శనంగా హన్మకొండ జిల్లా వేలేరు మండలంలో ఆదివారం జరిగిన రెండవ దఫా సర్పంచ్ ఎన్నికల్లో వరంగల్ పోలీస్ అధికారి అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి పలు గ్రామాలను సందర్శించారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా శాంతి భద్రతల రక్షణ కోసం విధులు నిర్వహిస్తూనే వృద్ధులను ఓట్లు వేయించడానికి వీల్ చైర్ల సహాయంతో సహకరించిన తీరు మండలంలోని ప్రజల్ని అబ్బురపరిచింది. ఇదంతా కేవలం ప్రజలకు ఓటు హక్కు విలువ తెలియాలనే ఉద్దేశం కోసమే చేసినట్లుగా పోలీస్ అధికారులు తెలుపుతున్నారు. వృద్ధులకు ఓటు వేయడంలో సహకరించిన విధానం దానితోపాటు దగ్గరుండి ఓట్లు వేయించిన విధానం అద్భుతం అని గ్రామస్తులు అభినందిస్తున్నారు. వేలేరు మండలంలోని కమ్మ రైపేట్,ఎర్రబెల్లి,శాలపల్లి,పిచర్ల, మద్దెలగూడెం,కన్నారం,శుదనపల్లి మల్లీ



కుదుర్ల,గుండ్ల సాగర్ ,బంధాతండా పలు గ్రామాలలో జరిగిన ఎన్నికలను విస్తృతంగా పర్యవేక్షించిన అడిషనల్ కమాండెంట్ శ్రీనివాస్ ఎన్నికలు పూర్తయ్యేవరకు తన సిబ్బందిని ఉపయోగించి పలుచోట్ల సేవలు అందించడం ప్రజాసేవ పట్ల పోలీస్ ఉదారతను చూపుతూ మరోసారి చాటిచెప్పినట్లుగా ఉంది,ఈ సేవా కార్యక్రమంలో కన్నె రాజు సిమ్మర్ రాజు సిటీ గాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 'మసక మసక చీకటిలో' పాట కొత్త వెర్షన్ తీసుకువచ్చిన స్మిత

**గాయని స్మిత సరికొత్త ప్రయోగం**
**పాటకు ర్యాప్ జోడించిన నటుడు నోయల్**
**యువతరాన్ని ఆకట్టుకునేలా రూపకల్పన**
**తాజాగా విడుదలైన వీడియోకు మంచి స్పందన**

ప్రముఖ గాయని స్మిత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలు. తన గాత్రంతో ఎన్నో విజయవంతమైన పాటలు పాడిన ఆమె, ప్రైవేట్ ఆల్బమ్స్‌తో కూడా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా, కొన్నేళ్ల క్రితం పాత పాటకు కొత్త హంగులద్ది ఆమె విడుదల చేసిన 'మసక మసక చీకటిలో' ఆల్బమ్ ఎంత పెద్ద సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే పాటకు ఆధునిక హంగులద్దుతూ మరో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుత యువతరాన్ని ఆకట్టుకునే లక్ష్యంతో 'మసక మసక' పాటకు ర్యాప్ జోడించి ఒక కొత్త వీడియోను రూపొందించారు. ఈ పాటలో ఆమెతో పాటు ప్రముఖ నటుడు, ర్యాపర్ నోయల్ కూడా పాల్గొన్నారు. పాత మెలోడీకి నోయల్ ర్యాప్‌ను జోడించి ఈ పాటను మరింత ట్రెండీగా మార్చారు. ఈ ప్రయోగం ద్వారా నాటి తరం అభిమానులతో పాటు నేటి తరం శ్రోతలను కూడా ఆకట్టుకోవాలని స్మిత భావిస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ఈ వీడియోకు సోషల్ మీడియాలో మంచి స్పందన వస్తోంది. స్మిత, నోయల్ కలిసి చేసిన ఈ కొత్త 'మసక' సాంగ్ ప్రస్తుతం సంగీత ప్రియులను అలరిస్తోంది.

